# నేరం

ఆ దంపతులు ఆస్పత్రి వదిలిన దగ్గర నుంచీ-ఒక్క మాట మాట్లాడుకోలేదు. ఇద్దరి మనసులూ, మెదడూ ఆస్పత్రి మీదే వున్నాయి. ఆస్పత్రి గదిలో పడక మీద వున్నాయి. దాని మీద పడి వున్న వైష్ణవ్య మీద వున్నాయి. నలభై అయిదేళ్ళ ఆమె మూసిన కళ్ళ మీద వున్నాయి. వాటిని మూసిన నేరం మీద వున్నాయి.

హైదరాబాద్ రద్దీ నుంచి బయటపడిన కారు మలక్‌పేట దాటింది. రోడ్డుకి అటూ యిటూ వున్న దుకాణాలు, వాటి దీపాలూ సత్యాన్ని మూసేస్తున్నంత వెలుతురుగా వున్నాయి.

సరూర్‌నగర్‌లో యింటి ముందు కారు ఆగింది. లలిత లోపలికి వెళ్ళింది. మురళి తలుపు తీశాడు.

"ఎక్కడికెళ్ళారమ్మా-"

చెప్పింది.

"ఏమయింది ఆంటీకి?"

పద్నాలుగేళ్ళ కుర్రాడికి ఏం జరిగిందో ఎలా చెపుతుంది?

ఆమె ఆలోచిస్తుండగా - వాచస్పతిరెడ్డి కారు గారేజ్‌లో వుంచి వచ్చాడు. వస్తూనే-టీవీ వాల్యూం ఎక్కువయిందని-కొడుకుని కసిరి, టీవీ కట్టేసాడు.

చిన్నబోయిన మురళి చేతికి రిమోట్ యిచ్చింది. నుదుటి మీద ముద్దు పెట్టుకుని-కొంచెం సేపు చూసి చదువుకో అంది.

బాత్రూం నించి రిఫ్రెష్ అయివచ్చి, మంచం మీద వాలింది. అలసిన ఆమె శరీరం నిద్రలోకి జారిపోయింది. కళ్ళు విప్పేసరికి 9-40 నిమిషాలు. గబగబా వంట గదిలోకి నడిచింది.

డైనింగ్ టేబిల్ ముందు కూర్చుని బెండకాయలు తరుగుతున్నాడు రెడ్డి. భార్య అలికిడికి దృష్టి మళ్ళింది.

కాస్త బొద్దుగా... పసిమి పచ్చని ఛాయతో... నుదుట చిన్ని బొట్టుతో... విశాలంగా తెలివిగా వున్న కళ్ళతో... వదులు వదులు జుత్తు....

లలిత!

ఉద్విగ్నతతో ఆమె చేతిని పట్టుకున్నాడు. నుదుటా, కళ్ళ మీదా రాసుకున్నాడు. నడుం చుట్టూ చేతులు బిగించి... కదిలిపోతున్న శరీరంతో... కళ్ళలో తేమతో... రుద్ధమవుతున్న గొంతుతో... అన్నాడు.

"నేనే-నేనే-వైష్ణవ్య జీవితాన్ని నాశనం చేసాను లలితా."

అతనలా అంటూంటే- అతని మాటను ఖండించాలన్న ఆలోచనలు లలితలో ఉబికాయి. ఆమె మాట్లాడలేదు.

"నిజం లలితా-వైష్ణవ్య నాన్నగారు అన్నది అక్షరాలా నిజం. నేనే ఈ నేరానికి బాధ్యుడిని. నేనే నేరస్తుడిని-" అలా యింకా మాట్లాడుతున్న అతని మొహాన్ని మరింత దగ్గరకు తీసుకుంది.

ఆమె చర్య యిచ్చిన సానుభూతినీ, ధైర్యాన్నీ యింకించుకున్నాక-ఆమె మొహంలోకి చూడటానికి తలఎత్తుతూ-"మాట్లాడవేం-లలితా"

"ఏం మాట్లాడను? నువ్వు ఎమోషనల్ అని తెలుసు-అలాంటివేవో ఆలోచనలు నీలో కలుగుతాయనీ తెలుసు-కాని-మరీ యింత ఎమోషనలవటం-నాకు ఆశ్చర్యంగా వుంది-" అంది.

చటుక్కున ఆమెను వదిలి, టేబిల్ మీదే వున్న సెల్ ఫోన్ తీసుకున్నాడు- ఎంత ధైర్యం ఆ లంజకొడుక్కి-వైష్ణవ్య మీద చెయ్యేస్తాడా- వాడిని బతకనియ్యకూడదు-అంటూ నంబర్లు నొక్కసాగాడు.

"ఎవరికి-ఎవరికి-" అంటూనే వుంది.

కాస్త పక్కకి నడుస్తూ- 'ఎవరూ-ఇనస్పెక్టర్ దయానందమా- నేనూ- వాచస్పతిరెడ్డిని- నోరు విప్పాడా ఆ లంజాకొడుకు-?"

"..."

"ఒప్పేసుకున్నాడా నేరం-ఏం చేస్తాడు-ఒప్పుకోక-"

"..."

"కోర్టూ-గాడిదగుడ్డూ-ఏం చేస్తారో నాకు తెలీదు-వాడు ప్రాణాలతో మిగలకూడదు-ఎంతయినా నేను చూసుకుంటాను-ఏం జరిగినా-బాధ్యత నాదే-"

"..."

అతని చేతిలోని సెల్‌ఫోన్ లాగేసుకుంది లలిత. ఆఫ్ చేసింది.

''నే చెప్పేది వింటావా- యిక్కడ నుంచి పొమ్మంటావా?" అతని భుజం పట్టుకుని కుదుపుతూ గద్దించింది.

అయోమయంగా ఆమెని చూస్తూ- కుర్చీలో కూలబడ్డాడు.

"ముందీ మంచినీళ్ళు తాగు!"

తాగాడు.

"చాలా లేటయిపోయింది. వంట-భోజనాలు-అవనీ! తర్వాత మాట్లాడుకుందాం- అందాకా ఏమీ ఆలోచించకు-"

బెండకాయల పని తిరిగి మొదలెట్టాడు రెడ్డి.

***

రెండేళ్ళ క్రితం-

ఆరోజు రాత్రి యిలాంటి వేళే-భోంచేసి- కిళ్ళీ బిగించి-సిగరెట్ ముట్టించి-కంప్యూటర్ ఆన్ చేసి-మెయిల్ చూస్తున్నాడు రెడ్డి.

ఆరు ఉత్తరాలు- విదేశాల నుంచే-రియల్ ఎస్టేట్ ప్రాజెక్టు వివరాలు-మార్కెటింగ్ సెక్షన్‌కి ట్రాన్స్‌ఫర్ చేసాడు.

చివరి మెయిల్-

"గుర్తున్నానా? ఈ మెయిల్‌లో నీ అడ్రసు వెదికి మరీ రాస్తున్నాను. నువ్వు కాక మరెవరవుతారని భరోసా. నువ్వే అయావనుకో- కనీసం వ్యాపారం కోసమన్నా-జవాబియ్యి. నువ్వు కాలేదనుకో-వ్యాపారం కోసం-జవాబియ్యి. నువ్వు అయి-నువ్వు కాలేదనుకో-ఈ ఉత్తరాన్ని రీసైకిల్ బిన్‌లోకి నెట్టెయ్యి.

ఇంకా గుర్తు రాలేదా వాచస్పతీ- కాస్తంత జ్ఞాపకాలలో పడు-! టైముందా-? ఎవడి దగ్గరుందిలే- ఎదిగిన మధ్య తరగతిలో- డబ్బు తప్ప-! మరీ చిన్నతనం దాకా వెళ్ళక్కర్లేదు- యవ్వనంలో- ప్రపంచమంతా మనదే అనుకుని- దాని దుఃఖమంతా మనమే అనుభవించి-దాన్ని మార్చెయ్యటానికి- మావో ఆచరణను ఒక చేత్తో-తుపాకీ భుజాన వేసుకుని మరో చేత్తో- తండ్రులను వదిలేసి- భద్రమయిన బ్రతుకులను తోసేసి- తెలంగాణా పల్లెల్లో- తలెత్తుకుని- రొమ్ము విరుచుకుని- అజ్ఞాతంగా తిరిగిన రోజుల దాకా వెళ్తే చాలు-

ఆ రోజుల్లో- 'నువ్వు ఆడపిల్లవీ- బరువులు మొయ్యలేవూ-' అని నువ్వూ- 'ఇలా చెప్పే మమ్మల్నిలా తొక్కేసారు మీరు-' అని నేనూ ఆడుకున్న దెబ్బలాటల దాకా వెళ్తే చాలు-


నువ్వు మూతి బిగించి- 'ఆడా, మగా కాదు సుబ్బమ్మా- దైహిక బలంలో తేడాలు- పని విభజన-' అంటూంటే- 'పోవోయ్ కొత్త బూసామీ-' అంటూ మొట్టిన మొట్టుల దాకా చాలు-

అమ్మయ్య- గుర్తొచ్చాను కదా-

అవును- నేనే- వైష్ణవ్యను- నిజమే- శ్రీశ్రీ పటాన్ని పెట్టుకుని-మహాప్రస్థానాన్ని మంత్రాల్లా చదువుతూ-బియ్యంలో రాయలేదులే- ఎందుకంటే బియ్యం ఆస్తికత్వం- పలక నాస్తికత్వం- రాసిన పేరు వైష్ణవ్య నాదే!

రెడ్డీ-

నిన్ను మీ నాన్న- పోలీసుల ద్వారా బయటకు లాక్కొచ్చి- ప్రధాన స్రవంతిలో కలిపేసాడు గదా- మరో ఆరెడు నెలలకి మా నాన్నా అదే పని చేసాడు. మీ నాన్నకి నిన్ను అక్కడే వుంచే ధైర్యం వుంది గాని- మా నాన్నకి ఆ ధైర్యం లేదు గాబోలు- మరో అడుగు ముందుకు వేసాడు. నాకు పెళ్ళి చేసి, మా యిద్దర్నీ అమెరికా తరిమేసి- పెళ్ళికీ,




చదువుకీ, ఉద్యోగానికీ నన్ను బిగించేసి- చేతులు దులుపుకున్నాడు.

పన్నెండేళ్ళయింది-

మా రాఘవ గారు- చాలా మంచివాడు. నీలా ఫ్యూడల్ కాదు. పూర్తి లిబరల్. సమానంగా చూడటమే కాదు- నన్నూ, నా భావాలనూ తనకన్న ఎక్కువగా గౌరవించే తత్వం. నేను చాలా అదృష్ట వంతురాలిని-

మేమిద్దరం, యిక్కడ పెట్టుకున్న షాపు బ్రహ్మాండంగా నడుస్తోంది. తెల్ల రోగుల మీద హాయిగా బతుకుతున్నాం.

ఈ మధ్య-

మన దేశానికి- దేశంలో వుండే వాళ్ళ దేశ భక్తి కన్నా, బయటనున్న వాళ్ళ దేశభక్తి ప్రశస్తమయినదన్న- జ్ఞానం కలిగింది. శాటిలైట్ చానల్స్ ద్వారా, ఇంటర్నెట్ ద్వారా మాతృభాష మా డ్రాయింగ్ రూంలలో మళ్ళీ ప్రవేశించింది. దానాదీనా పొగడరా నీ తల్లి భూమి భారతిని- అన్నది స్లోగన్ ఆఫ్ ద డే అయింది.

దాంతో-మాకూ అక్కడికొచ్చెయ్యాలన్న ఆలోచన వచ్చింది. చెప్పాను గదా- రాఘవ గారు నాకన్న ఉత్తముడు. సంపాదన యావ లేదు. తన పరిధిలో తనకి జనాలకి చవకలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పెట్టాలని వుంది.

అందుకు నువ్వేమన్నా చేయగలవా?

మా నాన్న-తలుచుకుంటే-చేయగలడు. కాని- తలుచుకోడు- నేను కదిపాను. 'దేశం అలాగే వుంది- దరిద్రం అలాగే వుంది- నువ్వు యిక్కడకు వస్తే- మళ్ళీ ఉద్యమంలోకి- అజ్ఞాతంలోకి- పోయే దోవలు అలాగే వున్నాయి- అని మా నాన్న ఉద్దేశ్యం.

లేదు తండ్రీ- దేశం ఎలా వున్నా- నేను అలా లేను- ప్రపంచం అంతా ఆరిపోయిందంటున్న కమ్యూనిజం గురించి కన్నీరు కార్చగలనేమో గాని- రక్తాన్ని ధారపోయలేను- అని చెప్పాను.

వినలేదు.

నువ్వేమీ మారలేదు. మారతావన్న నమ్మకం నాకు లేదు- అయినా నరేనని- బాబా గారిని సంప్రదించాను- ఆయన వద్దన్నారు-

అంటూ మా దేశ పునరాగమనం చాప్టర్ని మూసేసాడు.

నువ్వేమన్నా తెరవగలవా-?

***

ఆ రోజు ఆ ఉత్తరాన్ని రీ సైకిల్ బిన్‌లోకి తోసేసినా బాగుండేది- ఈరోజు వైష్లవ్య బతుకు యిలా అయేది కాదు- అనుకున్నాడు వాచస్పతి.

బెండకాయ ముక్కలు కడిగి లలితకి యిచ్చాడు.

సిగరెట్ ముట్టించాడు.

***

ఆ చాప్టర్ తిరిగి తెరిచాడు.

నెల తిరగకుండా వైష్లవ్య, రాఘవ చౌదరీ వచ్చారు. మొదటి దఫా పదిహేను రోజులున్నారు. లలితా, మురళీ వైష్లవ్యకి దగ్గరయ్యారు. రెడ్డీ, చౌదరీ మందులో మరింత దగ్గరయ్యారు.

స్థలం... భవనాల నిర్మాణం... ప్లాన్... ఎప్రూవల్... ఎగ్రిమెంట్లు... సిబ్బంది...

"మీరు చేస్తున్న సాయానికి..." అన్నాడు ఓమారు రాఘవ.

"అయ్యో- ఇందులో సాయం ఏమీ లేదు- ఉన్నది బిజినెస్."

"అలా అనకండి-"

"నన్ను ఫ్యూడల్ గాడిద అనేది వైష్ణవ్య- మీ సెంటిమెంట్స్ చూస్తుంటే మిమ్మల్ని ఏమనాలో-" నవ్వాడు రెడ్డి.

"ఇప్పుడూ అదే అంటాను- ఏం నీకు మాత్రం తక్కువున్నాయా సెంటిమెంట్సు-" అంది వైష్ణవ్య.

"సెంటిమెంట్సుని బట్టి ఫ్యూడల్‌గా జమకట్టడం ఎంతవరకూ కరక్టో తెలియదు గాని- నేనిప్పుడు కాపిటలిస్టు దున్నపోతుని. దున్నపోతు రోడ్డున పడితే- దాన్నెవరన్నా తప్పించుకోవాలి గాని- అది మాత్రం తప్పుకోదు"

విమానాలు వస్తున్నాయి. పోతున్నాయి.

రాఘవ వస్తూ పోతున్నాడు.

కొన్నాళ్ళు తిరిగాక, కొందరిని కలిసాక, కొన్ని పనులు సఫలమయిన సందర్భంలో- చనువు పెంచిన మందులో- రాఘవ భుజం చరిచాడు రెడ్డి.

"గురూ- నువ్వెక్కడున్నా నీ కులాన్ని మరవకూడదు అన్నది తెలుగోడి నీతి. మామూలాడికి అది కూడూ గుడ్డా పెట్టదు గానీ, అవన్నీ అమరిన వాడు లక్షలని కోట్లు చెయ్యదలుచుకుంటే- యిక్కడ మాత్రం పాస్‌వర్డ్‌లా పని చేస్తుంది. నీ అమెరికాలో కులం అలంకారమేమో గాని యిక్కడ అది కత్తీ మరియూ డాలూ."

అన్నాక- గబగబా లార్జి పెగ్గుతో గొంతు కాల్చుకున్నాడు వాచస్పతి.

ఎప్పటిలాగే- రాఘవ నోరు విప్పలేదు. సన్నటి నవ్వుతో- మెల్లగా మందు చప్పరించాడు.

ఆ చాప్టరు నడుస్తూండగా-

రకరకాల ప్రశ్నలు. అనుమానాలు. తనలోని తనను లలితంగా కాపాడుకుంటూ వచ్చిన లలితే శరణ్యం అయింది.

"భయంగా వుంది లలితా-"

"ఏం భయం?"

"వైష్ణవ్య-"

"ఏం- వైష్ణవ్య దెయ్యంలా లేదే-"

"ఆమె ఆశయాలే నేనూ ధరించాను- ఆమె వెనకే నేనూ అడవులకు వెళ్ళాను- ఇదంతా ఆమె కోసమే చేసాను-"

నవ్వింది లలిత.

"ఎందుకు నవ్వుతున్నావ్-"

"..."

"అదిగో మళ్ళీ అదే నవ్వు. నాకు ఉడుకుమోత్తనంగా ఉంది-"

"నా పాత్రలోకి నువ్వు అడుగు పెడుతున్నందుకు-"

"ఏం పాత్ర?"

"భయపడాల్సిన పాత్ర"

మరోమారు-

"పాపం- వైష్ణవ్యకి పిల్లల్లేరు-"

"ఏం నాయనా- నీకేలా విచారం?"

"పిల్లలు... ఉండాలి గదా..."

## సిటీ ఆఫ్ సైకిల్స్

ఒకప్పుడు మనదేశంలో ఏ నగరంలోనూ లేనన్ని సైకిళ్లు హైదరాబాద్‌లో ఉండేవి. అందుకే 'సిటీ ఆఫ్ సైకిల్స్' అని పేరు వచ్చింది. ఇప్పుడు సైకిళ్ల సంఖ్య తగ్గింది కానీ ఇప్పటికీ 'సైకిలే' నగరాన్ని పాలిస్తోంది. అందుకని 'సిటీ ఆఫ్ సైకిల్'గా వ్యవహరించవచ్చు.

"కాదు- వారసులు ఉండాలి- అదీ ఆస్తిపరుల విచారం-"

"మరీ అంత మూలాలలోకి వెళ్ళొద్దు లలితా- పిల్లలు లేని దాంపత్యాలు సంపూర్ణం కావు. ఇది దురదృష్టమే-"

"వాళ్ళిద్దరూ ఒప్పందం చేసుకున్నారు. వైష్ణవ్య ఆపరేషన్ చేయించుకుంది-"

"ఇంపాజిబుల్-"

"అంత గట్టిగా అరవకు- వాళ్ళ బ్రతుకు వాళ్ళది-"

"రాఘవ గ్రేట్-"

"ఈ సర్టిఫికెట్ ఎందుకబ్బా-"

"లోకంలో దరిద్రం ఉన్నంత కాలం- అనాథలున్నంత కాలం- మనలాంటి వాళ్ళకి పిల్లల్ని కనే హక్కు లేదనేది వైష్ణవ్య. ఒప్పుకునే వాడిని కాదు. మన పిల్లలు మన పోరాటాలను ముందుకు తీసుకువెళ్తారనే వాడిని-"

"అయితే- మరి వైష్ణవ్యే గ్రేట్ కదా-"

"దాన్ని ఆయన ఒప్పుకోవడమే గ్రేట్-"

"ఓరి ఎమ్‌సీపీ-"

ఆస్పత్రి పూర్తయింది-

భార్యా భర్తా భారతదేశానికి-- భాగ్య నగరానికి- శాశ్వతంగా వచ్చేసారు. జూబ్లీ హిల్స్‌లో ఓ భవంతి కొనుక్కున్నారు.

శ్రీశ్రీ మల్టీ స్పెషాలిటీస్- ఆస్పత్రికి విద్యా మంత్రి రిబ్బన్ కత్తిరించాడు. వేదిక మీద వైష్ణవ్య తండ్రి ఉపన్యసించాడు. వేదిక మీద అందరినీ పొగిడాక- లోకంలో విషయాలను పట్టుకున్నాడు. పేదలు- దళితులు- రైతులు- వెనకటి పోరాటాలు- ఈనాటి నాయకుల విజన్- వారి అకుంఠిత దీక్ష- రాబోయే సంకీర్ణ ప్రభుత్వాలు- పెరిగిన ప్రజా చైతన్యం- బలపడ్డ ప్రజాస్వామ్యం- ప్రపంచీకరణ ఫలాలు జనానికి అందనివ్వని అనాయావరులు- దోవ తప్పని నాయకులూ- దోవ తప్పిన యువకులూ- అనంతంగా సాగుతున్న ఉపన్యాసానికి అడ్డుకట్టవేసి- మరో సూపర్ మార్కెట్ ఆరంభానికి టైమయిపోతోందంటూ వెళ్ళిపోయాడు విద్యామంత్రి.

ఆ ప్రారంభోత్సవంలో- ఓ మూలగా మౌనంగా ఉండిపోయారు రాఘవ తల్లిదండ్రులు.

హడావుడి ముగిసింది-

బంధువులు వెళ్ళిపోయారు-

విశాలమయిన ఆ భవంతిలో రాఘవ, వైష్ణవ్య మిగిలారు-

ఓ రోజు- ఫోన్ చేసాడు రాఘవ.

"ఈ దేశంలో కారు చౌకగా దొరికేది పనివాళ్ళే చౌదరిగారూ-"

"మాకు చవక అవసరం లేదు- నమ్మకం కావాలి-"

"అలాగే లెండి-"

"ఇప్పటిదాకా- అన్నీ మీ చేతులమీదే అయాయి. ఇప్పుడు మా మామ గారిని అడగొచ్చు- ఆయన పంపేది పనిమనిషిని గాదు- నా మీద గూఢచారిని- అంటుంది వైష్ణవ్య. మా వాళ్ళకి చెప్పొచ్చు- వేరే పని మనిషి, ఎందుకూ- మన వాళ్ళనే ఎవరినో ఒకరిని పంపుతానంటాడు మా నాన్న. వాళ్ళ చేత పని చేయించుకోలేం- చెయ్యకపోతే వదిలించుకోలేం-"

"చాలా కతుందే- యింతకీ మీ స్పెసిఫికేషన్స్ ఏమిటి?"

"మీ సాంకేతిక పదజాలం నాకు ఎక్కలేదు-"

"ఆడా-మగా-వయసే మాత్రం ఉండాలి-బలమెంత ఉండాలి-కుటుంబం ఉండొచ్చా- ఉండకూడదా- ఉంటే ఎంత ఉండొచ్చు- ఉండకపోతే-"

"అయ్య బాబోయ్- యిన్ని ప్రశ్నలా-'

"స్టాండర్డ్స్ సంస్థలు ఇడ్లీల దగ్గర నుంచి అన్నింటికీ స్టాండర్స్ తయారు చేసాయి. చాలా పనులు సులువు చేసి పెట్టాయి. అసలు సరుకు- పనివాడు- క్వాలిటీ నిర్ధారించే స్పెసిఫికేషన్స్ మాత్రం యింకా తయారు కాలేదు- ప్రపంచ స్టాండర్డ్స్ సంస్థ అజండాలో యీ విషయం ఉండే ఉంటుంది. అదేదో తయారయే దాకా- మన స్పెసిఫికేషన్స్ మనమే తయారు చేసుకోవాలి-"

"మీ స్టోన్‌లో ఏదో ఎర్రవాసన-"

"రాళ్ళకి వాసనలా? విషయానికి రండి రాఘవ గారూ-"

"వైష్ణవ్య అవసరాలు మీకూ తెలుసుగదా- యింక నేనా?- ఏ అభిప్రాయాలూ లేకుండానే పుట్టి, పెరిగి బతికేస్తున్న వాడిని. ఇల్లంతా వప్పజెప్పి వెళితే- కాస్తంత నమ్మకంగా చూసుకోవాలని- ఆశపడుతున్నా. తప్పేం కాదుగా-"

"అచ్చం నాలాంటాడు కావాలి-"

"అయ్య బాబోయ్- మిమ్మల్ని మోసే శక్తి మాకు లేదు-"

మరికొంత సంభాషణ అయాక ఫోన్ పెట్టేసాడు. వెంటనే పడుకోలేదు వాచస్పతి. అతన్నే చూస్తోంది లలిత.

"ఎందుకు డిస్టర్బ్‌డ్‌గా వున్నావ్?" అడిగింది.

వాచస్పతి జవాబివ్వలేదు.

"చెప్పరా-" చొక్కాలో చెయ్యి పెట్టి గుండెల మీద జుత్తు సవరించింది.

"లలితా-"

"చెప్పు-"

"బయటి ప్రపంచాన్ని స్వాధీనపరచుకుందుకు ప్రయత్నిస్తాం- ఏమాత్రం దొరికినా- నెగ్గిన ఫీలింగ్- అదే- అదే- ఈలోపలి ప్రపంచం ఉందనుకో- దీన్ని వశపరచుకోవటం- ఏమో- అందరికీ సులువేనేమో- నాకు మాత్రం యిది అసాధ్యం. ఏమాత్రం నెగ్గినా- ఓడిపోయామన్న భావన- అపరాధ భావన-"

"వాచస్పతి- నువ్విప్పుడు కవిత్వం మూడ్‌లో వున్నావు- ఆ పని చెయ్యరాదూ-"

చటుక్కున అతని కళ్ళలో తేమ-

"నువ్వన్నది నిజమే లల్లీ– బాధా ఒక సరుకే– దాన్ని కవిత్వం రేపరులో చుట్టి– అంతో యింతో కీర్తికి అమ్ముకోవచ్చు–"

చేతిలో పుస్తకాన్ని పక్కనపెట్టి– సారీ– అంది లలిత. తన ఉద్దేశ్యం అది కాదంది– వివరించే ప్రయత్నం–

ఆమె చదూతున్న పుస్తకంలో అండర్‌లైన్ చేసిన వాక్యాలను చదవబోయాడు– We must ask if the individual is taking major part in creating his own occupation or whether the occupation or profession is bearing down on him to the point where he is made over in the image of occupation- చదివిన వాక్యం మీద మెదడు పెట్టబోయాడు. కుదరలేదు– దాన్ని పక్కనే పడేసాడు.

వివరించే ప్రయత్నాన్ని అప్పటికే ఆపేసింది లలిత.

"ఏంట్రా ఈ అస్థిమితం–"

"రావిశాస్త్రి ఎక్కడో అన్నారని గుర్తు– చెడుని ద్వేషించడంతో మొదలు పెట్టి– క్షమించటంతో మారి– ప్రేమించటంతో ముగుస్తామని... అలా క్షమించటం మొదలెట్టిన వాళ్ళే ఆయన పాఠకులని– యింకెవరో అన్నారు–"

"వాచస్పతీ–"

"నేను చెడిపోయానన్న బాధకన్నా– వైష్లవ్యను యిలా చూడటం యింకా బాధగా వుంది."

"ఆమెలో– నాకేం పొరపాటు కనిపించలేదే–"

"ఎందుకంటే– నీకు వైష్లవ్య తెలీదు– వైష్లవ్య ఒకప్పుడు–" మాట పూర్తి చేయలేదు వాచస్పతి.

అతనేమయినా చెప్పబోతాడా అని కొంతసేపు చూసింది. తర్వాత ఆలోచనలో పడింది.

కొంతసేపయాక– వాచస్పతి హఠాత్తుగా అన్నాడు–

పనివాడికి విశ్వాసం ముఖ్యమా తెలివి ముఖ్యమా– ఫ్యూడల్ యుగం విశ్వాసానికే విలువనిచ్చింది– యిప్పుడు– పనివాడికి తెలివికావాలి. తెలివైన వాడు విశ్వాసంగా ఉంటాడా– దొబ్బి తింటున్న వాళ్ళంతా తెలివైన వాళ్ళే కదా– అందుకే అనుమానం. పనికిమాలిన మెదడు– పనికిమాలిన ఆలోచనలు–

అతని మాటల మీద శ్రద్ధ పెట్టలేదు లలిత.

అతని మాటలన్నీ అయిపోయాక– అతన్ని దగ్గరకు లాక్కుంది.

నుదుటి మీద ముద్దు పెట్టుకుంది.

"–ఇది ఏజ్ ఆఫ్ గిల్ట్. మన ఆలోచనలు ఒకలా– పనులు మరొకలా– మనసున్న వాడికి మనసే ఓ యుద్ధ రంగం వాచస్పతీ–"

యింకా దగ్గరగా జరుగుతూ– "లల్లీ–" అన్నాడు–

"ఏంట్రా–?"

"నువ్వు నా జీవితంలోకి రాకపోతే ఏమయ్యేది–?"

"అద్భుతమైన– ప్రశ్న–"

"వేళాకోళమా?"

"ఛా! జవాబు చెప్పనా?"

సందేహం తీరక– ఆమె కళ్ళలో సీరియస్‌నెస్ కోసం వెదకబోయాడు.

"వత్సా– నీ జీవితంలోకి లల్లికి బదులు– బల్లియున్నూ– లలిత జీవితంలోకి వాచస్పతి బదులు బృహస్పతియున్నూ– ప్రవేశించి యుండి యుండెడి వారు–"

కొట్టబోయాడు–

చేతులు కలిపింది–

కొంతసేపటికి– ఇద్దరూ అలసిపోయాక– చిరు చెమటలు నిండిన ఆమె మెడలో తలదాచుకున్నాడు–

"నీ సంగతి నాకు తెలువదబ్బా– నేను మాత్రం యిలా ఉండేదాన్ని కాదు" అనుకుంది మూతలు పడుతున్న కళ్ళతో.

రాజీని యింతిలా ఎంజాయ్ చేసే వాడిని కాదేమో– అనుకున్నాడు వాచస్పతి కళ్ళు మూసుకోడానికి ప్రయత్నిస్తూ–

***

ఆనాడు నేను ఆలోచించాల్సిన విధంగా ఆలోచించలేదు. తప్పంతా నాదే– అనుకున్నాడు వాచస్పతి పెరుగు వడ్డించుకుంటూ.

లలిత– మురళికి వడ్డిస్తోంది.

ప్లేట్ కడిగేసి– టేబుల్ మీద గిన్నెలను సర్దేసి– పడక గదిలోకి వెళ్ళాడు వాచస్పతి.

సిగరెట్ వెలిగించాడు–

ఆరోజు తను భిక్షాన్ని పంపే ముందు ఏమీ ఆలోచించలేదా? ఎన్నో ఆలోచించాడు.

భిక్షం తండ్రి అతని తమ్ముళ్ళు తమ యిళ్ళల్లో పొలాల్లో పని చేసిన వాళ్ళే– భిక్షాన్ని తీసుకొచ్చి తనకాళ్ళ మీద పడేసాడు అతని తండ్రి. వీడు నీ సొత్తు– ఏం చేసుకుంటావో బాబయ్యా– నీ యిష్టం అన్నాడు.

హైదరాబాద్ తీసుకొచ్చాడు. కొన్నాళ్ళు ఆఫీసులో వుంచాడు– కొన్నాళ్ళు యింటి దగ్గర వుంచాడు–

ఆఫీసులో– వాడికి కంప్యూటర్ అని పేరు పెట్టారు. ఇచ్చిన కమాండ్‌ని తుచ తప్పకుండా చేస్తాడు. అర్థం కాలేదా– హేంగ్ అయిపోతాడు. ఓమారు ఫస్ట్ క్లాస్ ఏసీ టిక్కట్లు తెమ్మని పంపారు. ఆ బండికి ఫస్ట్ ఏసీ లేదు. ఆ మాటే చెప్పాడు రిజర్వేషన్ క్లర్క్. కిటికీ వదలలేదు భిక్షం. హేంగయిపోయాడు. చివరకి పోలీసులు వచ్చి బయటకు లాక్కుపోవాల్సి వచ్చింది. ఇలాంటి కథలు ఎన్నో వచ్చాయి.

క్రమంగా భిక్షం ఎందుకు పనికొస్తాడో– గ్రహించాడు. విశ్వాసం. నమ్మకం. దానికి ఆరున్నర అడుగుల రూపం భిక్షం. అందుకే వైష్లవ్య యింటికి పంపాడు–

"నాగరిక సమాజంలో కోటి రూపాయలకు టెంప్ట్ అవని వాళ్ళు దొరక్కపోవచ్చు– అనాగరిక సమాజంలో– నిజమే–డబ్బుకి లొంగకపోవడం అనాగరికమే గదా– అలాంటాళ్ళు దొరికే అవకాశాలు జాస్తి. భిక్షం గాడు అలాంటాడు. వాడు యిద్దరి తిండి తింటాడు– పది మంది పని చేస్తాడు– మీకు కావాలంటే– సకల క్రయ విక్రయ దాన హక్కులతో సహా ధారాదత్తం చేస్తాను–" అన్నాడు. వైష్లవ్యనీ రాఘవనీ ఊదరగొట్టేసాడు.

పంపితే ఏమయింది?

భీముడిలా తిండి తిన్నాక– ఇంటి పని, వంట పని, తోట పని– రోబట్‌లా చేసాడు. వాళ్ళిద్దరూ మాత్రం తక్కువగా చూసారా?

పడుకోటానికి– ఏసీ రూమ్ యిచ్చారు. ఫోమ్ బెడ్ యిచ్చారు. రూంలో ఓ టీవి– ఫ్రిజ్జు–

ఆశ్చర్యపోయాడతను!

అంతేనా– ఇంటికి అతిథులు వస్తే– వాళ్ళకి కాఫీలో టీలో యిచ్చి తను కూడా ఓ కప్పు తీసుకుని– వాళ్ళతో సమానంగా సోఫాలో కూర్చోవాలన్నారు–

మొదటిసారి చాలా చీదరవేసింది. తనూ లలితా ఓ సోఫాలో కూర్చుంటే భిక్షం ఎదురుగా మరో దాంట్లో కూర్చున్నాడు. సఫారీ వేసుకున్నాడు. వాడు భిక్షంగా ముందు తెలియకపోతే అంత ఎబ్బెట్టుగా ఉండకపోనేమో!

వైష్లవ్య తన ఫీలింగ్స్‌ని కనిపెట్టేసింది.

"భిక్షాన్ని– యిలా చూడటం– నీకు నచ్చలేదు గదా?"

"ఛఛ– అదేం లేదు వైష్లవ్యా– ఎప్పుడో ఒకప్పుడు కమ్యూనిస్టునే గదా"

"సిగ్గు పడకు వాచస్పతీ– ఇద్దరం ఒకరికొకరం బాగానే తెలుసు గదా– ఈ పద్ధతితో– కమ్యూనిస్టు– అన్న టాగ్ తగిలించుకోవాలని నాకేం లేదు–"

"అమెరికా– గొప్ప లిబరల్ సమాజం గదా–"

"అంత లిబరలేం కాదులే– జస్ట్– ఓ తృప్తి నాకు– ఇందులో ఎవరినీ కించపరచాలన్న ఉద్దేశ్యం మాత్రం నాకు లేదు–"

"కరెక్ట్– అది మాత్రం కరెక్ట్–" పెద్దగా నవ్వాడు రాఘవ.

"ఏమో– మీ యిల్లు– మీ పద్ధతులు– మీవి. అవి అందరూ పాటించాలని మీరేం నీతులు చెప్పటం లేదు గదా– పోతే– యిలా చేసినంత మాత్రాన– రివల్యూషనేం రాదు– అది రివల్యూషనూ కాదు–" అన్నాడు ఆ నవ్వులో నవ్వు కలుపుతూ.

ఆ తర్వాత– లలితతో ఈ విషయం చర్చించాడు కూడా.

"రాఘవకి– వైష్లవ్య మీద చాలా గురి. గౌరవం."

"ఈ సత్యం ఎలా కనిపెట్టావు గురూ–?" చెప్పాడు.

"భిక్షాన్ని వాళ్ళింట్లో అలా చూడటానికి– క్రెడిట్–

## డైనమిజమ్

దాదాపు వందేళ్ళ క్రితం ఉదయమే న్యూస్ పేపర్ చదువుతూ ఓ పేరున్న పెద్దమనిషి మరణాల కాలమ్‌లో తనపేరు చూసుకుని ఉలిక్కిపడ్డాడు. ఆ పత్రిక ఎవరో పేరుకి బదులు ఆయన పేరు వేశారు. తను చనిపోతే తన గురించి పత్రికలూ, ప్రజలూ ఎలా స్పందిస్తారో ఆయనకు బతికుండగానే స్పష్టమైంది. ఆయనను డైనమైట్ కింగ్ అనీ, మృత్యు వ్యాపారి అని పేపర్లు అభివర్ణించాయి. అవన్నీ చదువుకుని ఆయన బాధపడ్డాడు. అంటే మరణానంతరం తనని ఒక మృత్యు వ్యాపారిగా ప్రజలు గుర్తుపెట్టుకుంటారన్నమాట. ఆయన చలించిపోయాడు. ఆ రోజు నుంచి శాంతి కోసం అవిరళ కృషి ప్రారంభించాడు. ఆ పెద్దమనిషి పేరు ఆల్ఫ్రెడ్ నోబెల్. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన నోబెల్ బహుమతి ద్వారా ఆయన చిరస్మరణీయుడైనాడు.

క్రెడిట్ అని నువ్వనుకుంటే– వైష్ణవ్య ఖాతాలో జమ చేస్తాను. ఇందులో రాఘవ గారి భాగం ఏం లేదంటావు– భార్య ముద్దు చెల్లించే మగడు మాత్రమేనంటావు– అదీ నీ అభిప్రాయంబు–"

"కాదా?"

"ఏమో– నీ యీ అభిప్రాయం వెనక అభిప్రాయం ఏమిటీ అన్నదే– ప్రశ్న–"

ఆలోచించి నవ్వేసాడు.

"గొప్ప ఆలోచనలన్నీ వైష్ణవ్యకే కట్టబెట్టటంలో నాకు––" లలిత కూడా నవ్వేసింది.

"ఇంతకీ గొప్పదనమేనంటావు–"

"లల్లీ–"

"చెప్పు–"

"అది నిజంగా గొప్పదనమే– నాలాంటి వాళ్ళకి తట్టని ఆలోచన తట్టినా, అమలు చేసే సాహసం లేదు. ఒకవేళ– అలా ఆచరిస్తే– పనివాడు పని చేయకుండా ఎగ్గొడతాడేమోననే– భయం–"

నిజమే–

ఆనాడు తన భయం నిజమయింది. ఎక్కడ ఉంచాల్సిన వాడిని అక్కడే ఉంచాలి. లేకపోతే– ఇదుగో– యిలాగే– పడుకోటానికి గది యిస్తే– పడక మీదకు–

అవును–

కనకపు సింహాసనం మీద శునకాన్ని కూర్చోబెడితే ఏమవుతుంది!!

...2...

"ఇప్పుడు చెప్పు–"

మంచం మీద నడుం వాలుస్తూ అంది లలిత.

సిగరెట్ ఆష్ ట్రేలో వేసి ఆర్పేసాడు వాచస్పతి.

"నాకు మండిపోతోంది–" అంటూ ఆరంభించి మనసులో వున్నవన్ని కక్కేసాడు.

"నీ ఆవేశం తగ్గించుకొని– అడిగిన దానికి జవాబు చెప్పు–" అంది.

తనని తను అదుపులోకి తెచ్చుకుంటూ– అడుగు– అన్నాడు.

"ఈ నేరానికి కారణం నువ్వా– భిక్షమా– ఆవిడ పాటించిన పద్ధతా–"

"నేనే– ముమ్మాటికీ నేనే–" అన్నాడు ఉద్విగ్నంగా.

"నిజమే మరి! అమెరికా నుంచి వాళ్ళని తెచ్చింది నువ్వు– భిక్షాన్ని వాళ్ళింట్లో పెట్టింది నువ్వు. పనివాళ్ళని యిలా నెత్తికి ఎక్కించుకోరాదని హెచ్చరించలేదు– అద్భుతంగా వుంది నీ దరిద్రగొట్టు లాజిక్! నీతో మాట్లాడాలనుకోటం నా ఫూలిష్‌నెస్–" అనేసి, దుప్పటి తీసి ముసుగు పెట్టుకుంది.

వాచస్పతి ఉద్రేకంగా పిడికిళ్ళు బిగించాడు. నెమ్మదిగా తనను తను అదుపులోకి తెచ్చుకున్నాడు. ఆమె భుజం మీద చెయ్యి వేసి తనవేపు తిప్పుకున్నాడు. మొహం మీద దుప్పటి తొలగించుతూ అన్నాడు–

"ప్లీజ్– అర్థం చేసుకో– ఆ లంజకొడుకు చేసింది సాధారణ నేరం కాదు– ఓ దేవత మీద చేసిన అత్యాచారం–"

"చేసిన వాడు పనాడు– అందులోనూ– అంటరాని వాడు– అదీ కలుపుకో– యింకా ఆవేశపడు–"

వాచస్పతి వెర్రిగా... అయోమయంగా చూసాడు.

"జరిగింది కేవలం– అత్యాచారం. ఒక పురుషుడు ఒక స్త్రీ మీద చేసిన అత్యాచారం. ఆ స్త్రీ పురుషుల సామాజిక స్థితిగతులను బట్టి–ఆ నేరానికి వేర్వేరు స్థాయిలు ఉండవు. ఇప్పటి దాకా మన స్మృతులన్నీ అలాంటి తూనికలే చేసాయి. ఇప్పుడు కూడా మనం ఆ తూనికలనే మానసికంగా ఒప్పేసుకుంటాం–" అంది కోపంగా.

"నన్నిలా అనడం బాగులేదు లలిత. ప్లీజ్– అర్థం చేసుకో– వైష్ణవ్య చాలా గొప్ప వ్యక్తి. ఇది సాధారణంగా తీసుకోరాదు. దీనికి సాధారణ శిక్ష సరిపోదు–"

లలిత కొంతసేపు మాట్లాడలేదు–

"నువ్వు చెప్పాల్సింది పూర్తిగా చెప్పేసావా వాచస్పతీ!" అంది.

"ఎలా అయిపోతుంది– వాడికి శిక్షపడేదాకా– నా.."

"ఓ పని చెయ్యి– నీ చేతికి తుపాకి యిస్తుంది. చంపెయ్యటానికి అనుమతి యిస్తుంది ప్రభుత్వం. కాల్చెయ్యి. భిక్షం చచ్చిపోతాడు. అతని శరీరం కదలిక ఆగిపోతుంది. ఆ దేహం మట్టిలో కలసిపోతుంది.

అప్పుడు నీకు శాంతి కలుగుతుందా? అప్పుడయినా– నీకు శాంతి లభిస్తుందా–"

ఏదో అనబోయాడు. నోటి మీద చేయివేసి ఆపింది.

"ఆలోచించరా– ప్లీజ్–"

ఆలోచించాడు–

నాకు? ఏమో శాంతి కలుగుతుందేమో–?

వైష్ణవ్యకి–? రేప్ చేసిన వాడి మరణం శాంతి నిస్తుందా– ఏమో– యివ్వొచ్చేమో–!

రాఘవకి–? భార్యని ముట్టినవాడి మరణంతో– శాంతి కలుగుతుందా? ఏమో! కలగదేమో!

వివరించాడు వాచస్పతి.

మృదువుగా అంది లలిత–

"నేరం వల్ల జరిగే నష్టాన్ని శిక్ష ఎన్నటికీ పూడ్చలేదు. ఎందుకంటే– నేరం జరగటానికి కారణాలు వేరు. శిక్ష వెయ్యటానికి కారణాలు వేరు. ఒక్క ముక్కలో చెప్పాలంటే– నేరం చేసేది వ్యక్తి. శిక్ష విధించేది సమాజం లేదా ప్రభుత్వం.

ఒక వస్తువు యిద్దరికి అవసరమవటంలోనే నేరానికి బీజం ఉంది. ఆదిమ సమాజాలలో– దైహిక బలమే– ఆ వస్తువు మీద అధికారాన్ని నిర్ణయించేది. నాగరికుడవుతున్న మనిషి ఆ విధానాన్ని నిరాకరించాడు. అధికారాన్ని నిర్ణయించేందుకు కొన్ని నియమాలు పెట్టుకున్నాడు. నియమాల అతిక్రమణను– నేరం– అన్నాడు. దాదాపు సమాజాలూ– తర్వాత రూపమయిన ప్రభుత్వాలూ– ఈ కాన్సెప్ట్‌నే అనుసరించాయి. అలిఖిత నియమాలలో కొన్నింటిని చట్టంగా లిఖితం చేసుకున్నాయి. చట్టం అతిక్రమణే నేరంగా స్థిరపడింది.

శిక్ష–

బాధితుడికి శాంతినివ్వటం కోసం నేరస్తుడికి శిక్ష అనే భావన అనేది సమాజాలలో వుండేది. బాధితుడి పగ తీర్చిపెట్టటమే– సమాజం వేసే– శిక్ష.

చాలా చాలా కాలం వరకూ శిక్ష అంటే కేవలం నేరస్తుడి మరణమే– ఆ తర్వాత వచ్చిన రూపం 'వెలి'. నేరస్తుడి భౌతిక మానసిక అవసరాలను గుంపు తీర్చకపోవటమే– వెలి. ఆ తర్వాత క్రమంలో వచ్చిన రూపాలు– భౌతిక హింస. చివరగా వచ్చింది నిర్బంధం.

ఈనాడు ప్రభుత్వాలు అమలు చేస్తున్న శిక్షారూపాలు– ఉరి, నిర్బంధం మాత్రమే! వాటినే నాగరిక రూపాలుగా భావిస్తున్నారు. ఈ రెండు శిక్షలతో బాధితుడికి కలిగేది 'న్యాయం' అనే భావన. దానితో బాధితుడికి జరిగే నష్టం పూడుతుందా? శాంతి కలుగుతుందా? నేనలా అనుకోను–"

"అయితే వాడిని వదిలెయ్యాలంటావా–లలితా–"

"కాదురా– అర్థం చేసుకో– నేరస్తుడి మీద పగ తీర్చుకునే హక్కు బాధితుడికి యివ్వటం లేదు ప్రభుత్వం. శిక్షని అమలు చేసే హక్కు కూడా కల్పించలేదు. ఎందుకంటే– నేరానికి కారణమయిన మౌలిక ఆవేశాలను అనాగరికంగా, అసామాజికంగా భావించిన సమాజాలు బాధితునిలో వుండే అలాంటి ఆవేశాలను కూడా అనాగరికమూ, అసామాజికమూ అని గుర్తించింది."

"చేతకాని వాడిలా చేతులు ముడుచుకు కూర్చోమంటుంది–"

"లేదు. మరో నేరం చెయ్యమంటుంది–" కఠినంగా అంది లలిత.

వాచస్పతి మాట్లాడలేదు–

...3...

ఆరోజు– పేపర్లలో వచ్చిన వార్తని చూసి నిర్ఘాంతపోయాడు వాచస్పతి. పూర్తిగా పేర్లతో సహా వైష్ణవ్య మీద జరిగిన నేరం వివరాలు ప్రముఖంగా ప్రచురించబడ్డాయి.

వైష్ణవ్య మీద రేప్ జరిగిందని– భిక్షాన్ని పోలీసులు అరెస్టు చేసి తీసుకుపోయారని– వైష్ణవ్య అపస్మారక స్థితిలో వుందని ఆస్పత్రికి తీసుకువెళ్తున్నారని చెప్పాడు రాఘవ ఫోనులో. వెంటనే రమ్మన్నాడు. వెళ్ళగానే వాచస్పతి చేతులు పట్టుకున్నాడు. ఈ వార్త ప్రెస్‌లో ప్రముఖంగా రాకుండా చూడమని కోరాడు. వాచస్పతి ఆపనే చేసాడు. ఆ సంఘటన జరిగిన మూడవ రోజున పేపర్లలో క్రైం ఫైల్‌లో ఓ వివాహిత మీద అత్యాచారంగా నాలుగు వాక్యాలు మాత్రం వచ్చేట్టు మానేజ్ చేసాడు.

ఇన్నాళ్ళూ– వైష్ణవ్య షాక్ నుంచి బయటపడిందన్న న్యూస్ కోసం ఎదురు చూస్తున్నాడు.

ఈరోజు– ఇంత హఠాత్తుగా 'డాక్టర్ వైష్ణవ్యపై అత్యాచారం' అన్న పేరిట– ఏమిటీ వార్త?

రాఘవకి ఫోన్ చేసాడు–

ఎంగేజ్.

మళ్ళీ ప్రయత్నించాడు అసహనంగా.

లైను దొరికింది. ఎవరో ఫోన్ తీసారు. ఉండండి– పిలుస్తా అన్నారు– రకరకాల గొంతులు– పెద్దగా టీవీ

## ఎత్తుపై ఆంక్షలు

మెదక్ చర్చి మనదేశంలో వున్న పురాతన కట్టడాలలో ఒకటి. అది ఒక కొండమీద సువిశాలంగా రూపుదిద్దుకుంది. అయితే ఆ చర్చి ఎత్తు చార్మినార్ ఎత్తుకి మించి ఉండరాదని నాటి సర్కార్ ఆంక్ష విధించింది. వారి సూచనను అప్పటి బ్రిటీష్ దొర పాటించారు.

పాటలు- ఫోనులో వినబడుతున్నాయి.

'డాక్టరు గారు లేరండి-' సమాధానం ఫోన్ కట్.

సెల్‌కి ప్రయత్నించాడు వాచస్పతి.

ఆఫ్ చేసి వుంది.

రాఘవ ఎవాయిడ్ చేస్తున్నాడా-అనుమానం.

లలిత, మురళీ అప్పటికే కాలేజీకి, స్కూలుకీ వెళ్ళిపోయారు. మొహం కడుక్కుని-గబగబా తయారయ్యాడు. కారు తీసాడు.

రాఘవ ఇంటికి చేరే సరికి- హాల్లో కొత్త మొఖాలు, అతన్ని చూడగానే అందరూ మాటలు మానేసారు. రాఘవ ముందుగా పలకరించాడు- రండి రండి రెడ్డిగారు- అన్నాడు.

వాచస్పతి కూర్చున్నాడు.

తలిదండ్రులూ, బంధువులు, పేర్లు, పరిచయాలు. ఆఖరున- "ఈయన వాచస్పతి రెడ్డిగారు- మా కాంట్రాక్టరు-" అన్నాడు.

షాక్ అయిపోయాడు వాచస్పతి.

"అవునవును. సార్‌ని ఆస్పత్రి బిగినింగ్‌లో చూశా. బావుండారా రెడ్డిగారూ-" అన్నాడు రాఘవ తండ్రి.

తతిమ్మా వాళ్ళంతా ఒకరూఒకరూ లోపలికి వెళ్ళారు. తండ్రీ, కొడుకే వున్నారు.

వాచస్పతి నోరు పెకలించుకుని- పేపర్ చూసారా రాఘవ గారూ- అన్నాడు.

'చూసాను-' అంటూనే సెల్ ఫోన్‌లో ఎవరితోనో మాట్లాట్టం మొదలెట్టాడు.

"అలాగే- యిప్పుడే- బయల్దేరుతున్నా-" అంటూ ఫోన్ ముగించుతూ లేచి నించున్నాడు. 'సారీ- రెడ్డిగారూ- ఓ పేషంట్ కండిషన్ బాగోలేదుట- వెళ్ళాలి' అన్నాడు అపాలజిటిక్‌గా.

"నన్ను వెళ్ళిపోమంటారు-" కర్టగా అన్నాడు వాచస్పతి.

"కాఫీ తాగకుండానా. బలేవారే- నేను చాలా హర్టవుతాను- నాన్నా- రెడ్డి గారికి కాఫీ సంగతి చూడు-" అని షేక్‌హ్యాండ్ యిచ్చి వెళ్ళిపోయాడు.

వాచస్పతి లేవబోతుంటే- రాఘవ తండ్రి వదలలేదు. కాఫీ పురమాయించాడు.

"సారూ- మావాడు పెద్ద డాక్టరు- ఏం లాభం సెప్పండి- సుకం లేదు. మీకు తెలవందేముంది? అమ్మాయి కుటుంబం మంచిది గందా అని సేసుకున్నాం- అమెరికాలో ఎట్టా వున్నారో- మా కళ్ళతో- మేం సూడలేదు. మా రాఘవ సెప్పుకోలేదు. బిడ్డా, పాపా లేరేట్రా నాయనా- అని నెత్తి మొత్తుకున్నాం. అమ్మాయి ఆపరేసన్ సేయించుకుందిట- మావోడు ధర్మం తప్పనన్నాడు- మాకింతే ఆ బగమంతుడిచ్చాడను కున్నాం- యియ్యాల పనాడిని పట్టుకొచ్చి పల్లకీ ఎక్కించింది- కుక్క ముట్టిన కుండయింది- అంటరాని వాడు ఆ మడిసి మీద సెయ్యేసాడు-"

కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ- "మావాడు మామూలు మడిసైతే చాలు- నీకేం వయసయిపోయిందిరా- నీ దోవ నువ్వు సూసుకోరా- మాకు మనవల్నియ్యరా- అంటండా- మీరు మా వాడికి నచ్చజెప్పండి సారూ-"

ఒళ్ళు పట్టని ఆవేశంతో వణికిపోతున్న శరీరంతో ఛీ- దొంగ నా కొడకా- అంటూ ఊగిపోతూ అక్కడ నుంచి బయటపడ్డాడు.

రోడ్డు మీదకు వచ్చాడు. ఎడం ఎడంగా వున్న భవంతులు- యిళ్ళ ముందు కార్లు. మనుషుల అలికిడి లేదు-

పది గంటలకే ఎండ పేల్చేస్తోంది.

చెట్టు నీడలో నిలబెట్టిన కారుని సమీపించే వరకూ- అలవాటు ప్రకారం తీసే రిమోట్‌ని తీయలేదు. వచ్చాక జేబులో చెయ్యి పెట్టేసరికి సిగరెట్ పెట్టి. సిగరెట్ ముట్టించి కారుకి ఆనుకుని నించున్నాడు.

ఓ మనిషి అతనిని సమీపించి- 'సార్' అన్నాడు.

అపరిచితమయిన మొహం. తెల్లగా, బక్కపలచగా-

"గురూ- నువ్వెక్కడున్నా నీ కులాన్ని మరవకూడదు అన్నది తెలుగోడి నీతి. మామూలాడికి అది కూడూ గుడ్డా పెట్టదు గానీ, అవన్నీ అమరిన వాడు లక్షలని కోట్లు చెయ్యాదలుచుకుంటే- యిక్కడ మాత్రం పాస్‌వర్డ్‌లా పని చేస్తుంది. నీ అమెరికాలో కులం అలంకారమేమో గాని యిక్కడ అది కత్తీ మరియూ డాలూ."

చూడగానే ఆంగ్లో యిండియన్ అనిపిస్తున్నాడు. ఇన్‌షర్ట్, పాత స్లిప్పర్స్.

హఠాత్తుగా అతను వాచస్పతి కాళ్ళ మీద పడ్డాడు.

"సార్... సార్... ఆ భిక్షాన్ని మీరే సేవ్ చెయ్యాలి. వాడు ఇన్నోసెంట్-"

చటుక్కున వెనక్కి జరిగి- ఎవర్నువ్వు- అన్నాడు.

"నా పేరు నికోలస్. ఆ యింట్లో గార్డెనర్‌ని-" అంటూ మొదలెట్టాడు.

భిక్షానికీ నికోలస్‌తో స్నేహం కుదిరిందిట. రెడ్డి బాబు నాకు దేవుడు- అని చెప్పేవాడుట. డాక్టరమ్మా డాక్టరయ్యా- నాకు తల్లిదండ్రులు- అనేవాడుట. వాడికి ఏసీ రూమూ గట్రా యిచ్చారని విని నికోలస్ ఆశ్చర్యపోయాట్ట. పెద్దాళ్ళు ఏదీ ఊరికినే యివ్వరు- వాళ్ళు అమెరికా నుంచొచ్చారు- అక్కడ మొగుడూ పెళ్ళాలు వేరు- మొగుడి దోవ మొగుడిదే- పెళ్ళాం దోవ పెళ్ళానిదే- మగాళ్ళే కాదు- ఆడాళ్ళు కూడా ఆ పని చేయటానికి పని వాళ్ళని పెట్టుకుంటారు. ఎప్పుడో అప్పుడు డాక్టరమ్మ వచ్చి నీ పక్కలో పడుకుంటుంది- అని ఎక్కిరించే వాట్ట-

'సార్- నేనలా డర్టీగా మాట్లాడకపోతే- దట్ బగ్గర్ విల్ నెవర్ కమిట్ ద క్రైం-' అంటున్నాడు నికోలస్.

రెడ్డి అతని ఫిల్టు పట్టుకుని కొట్టడం మొదలెట్టాడు. నికోలస్ కిందపడ్డాడు. కొందరు పోగయారు. అతన్నించి నికోలస్‌ని తప్పించారు.

"మీరు నన్ను చంపెయ్యండి సార్- వాడిని మాత్రం సేవ్ చేయండి" అంటున్నాడు నికొలస్.

వాచస్పతి కారుని వేగంగా పోనిచ్చాడు.

సైటుకి వెళ్ళాడు- పనివాళ్ళు- యింజనీర్లు- సలహాలు-

ఎంతోసేపు ఉండలేకపోయాడు- వెళ్ళిపోతున్నానని చెప్పేసి బయలుదేరాడు.

నగరం సరిహద్దులు చేరేసరికి- సెల్ ఫోన్.

ఇన్‌స్పెక్టర్ దయానందం.

ఓ సంస్థ నుంచి కొందరు వచ్చారుట. భిక్షాన్ని కలిసారుట. నాది తప్పు- నాకు ఉరెయ్యాల- అనటం తప్పించి భిక్షం మరేం మాటలాడలేదుట. వాడి చొక్కా విప్పించి ఫోటోలు తీసుకున్నాడట.

నువ్వు వాడిని ఎలా టార్చర్ చేసి నేరాన్ని ఒప్పించావో మాకు తెలుసు- మేం దీన్ని సులువుగా వదలం- అని వార్నింగ్ యిచ్చారుట.

"డోంట్ వర్రీ- ఆ విషయం నేను చూసుకుంటాను-" అంటూ ఫోన్ ఆఫ్ చేసాడు.

వైష్ణవ్య ఆస్పత్రికి వెళ్ళాడు.

మత్తులో ఉంది వైష్ణవ్య. ఆమె తండ్రి వాచస్పతిని చూడగానే చదువుతున్న పేపర్‌ని విసిరికొట్టి, విసవిసా నడుచుకుంటూ ఆ గదిలోంచి బయటకు వెళ్ళిపోయాడు.

టీవీ శబ్దం తగ్గించి వచ్చి, కూతురు మంచం పక్కన నిలబడింది తల్లి.

వైష్ణవ్య మొహంలోకి చూస్తూ ఉండిపోయాడు వాచస్పతి.

మొహం మీద ముంగుర్లు కదులుతున్నాయి. బాబ్డ్ హెయిర్, తెల్లని చీర మీద ఎర్రని బోర్డరు. చేతి దండకు ఒకటి మణికట్టు మీద ఒకటి తావీదులు. మొహం మీద బొట్టు- దాని మీద విబూది.

స్పృహలో వున్నప్పుడు వైష్ణవ్య వదిలేసినవన్నీ ఆమె ప్రమేయం గాని, అనుమతి గాని లేకుండా ఆమెని ఆక్రమించుకున్నాయి.

ఆ మొహంలో ఏ ప్రభావమూ లేదు- ఓ విధమైన ప్రశాంతత. అది వాచస్పతికి ప్రశాంతతలా లేదు. ఒక నిశ్శబ్దపు కరవాలం అతని గుండెలని చీల్చబోతున్నట్లుంది. ఆమె మూసుకున్న కళ్ళ వెనక కదలికలు- మీదకి విసరబోతున్న తూటాల్లా అనిపిస్తున్నాయి.

వాచస్పతి మనసంతా నిస్తేజమయిపోయింది.

"ఏమయినా మాట్లాడిందా అమ్మా-!" అన్నాడు వైష్ణవ్య తల్లితో.

ఆవిడ రెండు చేతులూ జోడించి- ఆ దేముడే రక్షించాలి- అన్నట్లు శూన్యంలోకి నమస్కరించింది. చట్టున పక్కకి తొలగి తిరిగి- నోట్లో పైట కొంగు కుక్కుకుని- దుఃఖాన్ని దిగమింగుకోబోయింది.

మరోమారు వైష్ణవ్యని చూసి, ఆమె పాదాల మీద తొలగిన దుప్పటిని సవరించుతూ, వాటిని రెండు చేతులా తాకి, ఆ చేతుల్ని కళ్ళకి అద్దుకున్నాడు.

అక్కడ నించి బయటపడేసరికి- ఎండ పేల్చేస్తోంది.

ఇంటికి చేరి- తలుపులు తీసుకుని- లోపలకు వెళ్ళి- మంచం మీద అడ్డంగా బోర్లా పడిపోయాడు.

లేచి- సీసా తెరిచాడు- వాచస్పతి.

...4...

"నమస్కారం డాక్టర్-" తనని తను పరిచయం చేసుకుంది లలిత.

"మీ గురించి మీ వారు చెప్పారు- వైష్ణవ్య జనరల్ కండిషన్ బాగానే వుంది. మధ్య మధ్యలో హిస్టీరిక్‌గా

ప్రవర్తిస్తున్నారు. సెడిటివ్స్ యిస్తున్నాం- ఎపిసోడ్స్ తగ్గుతున్నాయి-" అంది డాక్టర్ ఝాన్సీ.

"ఓ సందేహం డాక్టర్-"

"అడగండి-"

"వైష్ణవ్యకి నలభై ఏళ్ళు దాటాయి. పెళ్ళయి- పదిహేనేళ్ళయింది. రేప్ జరిగితే- యింత షాక్‌కి లోనవటం ఆశ్చర్యంగా వుంది. అసమంజసంగా అనిపిస్తోంది- ఓ సైకియాట్రిస్ట్‌గా మీ అభిప్రాయం ఏమిటి?"

ఆమెను పరిశీలనగా చూసింది ఝాన్సీ.

"-మీ మెడికల్ ఎథిక్స్ నాకు తెలుసు-" అంది లలిత.

"-మీకు వైష్ణవ్య ఎన్నాళ్ళుగా తెలుసు-?"

"యించుమించు రెండేళ్ళ క్రితం పరిచయమయారు-"

"మీరేం చదివారు-"

"సోషియాలజీలో పీ.జీ. చేసాను. లెక్చరర్ని-"

"అయ్ సీ-"

"మీరేదో మాట్లాడాలనుకుంటున్నారు-"

"..."

"వైష్ణవ్య గురించి లోతుగా నాకు తెలియదు- వాచస్పతి మీకు ఉపయోగించగలడు-"

"ఆయనతో మాట్లాడాను-"

"ఎనీ యూజ్?"

"ఆమె ఐడియలిస్టు. ప్రోటుగానిస్టు కూడా..." అంటూ ఆగింది.

"చెప్పండి-"

"మీ భార్యాభర్తల మధ్యనున్న కమ్యూనికేషన్ వైష్ణవ్యకీ భర్తకీ లేదు-"

"వాచస్పతి అలా అన్నాడా?"

"మీ గురించి చెప్పారు. వాళ్ళ గురించి నా రీడింగ్ అది-"

"కమ్యూనికేషన్- అండర్ స్టాండింగ్- లేకపోతే పిల్లలు కనకూడదన్న నిర్ణయం ఎలా తీసుకోగలరు?"

"ఆవిడ ఆపరేషన్ చేయించుకున్నారు-"

"పిల్లలు వద్దనుకున్నాక చేయించుకోటంలో అసహజమేముంది?"

"ఇతర పద్ధతులున్నాయి-" అంది ఝాన్సీ.

"మే బీ- అది వాళ్ళ డిటర్మినేషన్ అవొచ్చు గదా?"

"ఎవరి డిటర్మినేషన్-" ప్రశ్నించింది ఝాన్సీ.

లలిత సాలోచనగా చూసింది.

"ఆ భార్యా భర్తలలో ఎవరో ఒకరు సప్రెషన్‌లో ఉన్నారు-"

"అఫ్‌కోర్స్- ఆడవాళ్ళు సప్రెస్ కాకుండా ఎలా ఉంటారు?"

"జనరలైజ్ చేస్తున్నారు- సోషియాలజిస్టుల అలవాటు-" అంటూ నవ్వి- "మేం ఏ కేసుకి ఆ కేసుగా చూస్తాం-"

"రాఘవ గారు సప్రెషన్‌లో ఉన్నారా-?"

"యస్. రాఘవ మామూలు వ్యక్తి. వైష్ణవ్య రేర్ పెర్సనాలిటీ. వాళ్ళ పెళ్ళి ఒక ఏర్పాటు, వైష్ణవ్య జీవిత వివరాలు ఆమె తండ్రి పెళ్ళికి ముందు చెప్పి వుండొచ్చు. కాని ఆమె వ్యక్తిత్వం గురించి చెప్పే అవకాశం లేదు. రాఘవకి దాన్ని తెలుసుకునే శక్తీ ఆసక్తీ లేకపోయి వుండొచ్చు. అమెరికా చదువు, సంపాదన వగైరాల కోసమే వైష్ణవ్యని చేసుకుని వుండాలి."

"వాళ్ళిద్దరి మధ్యా ఎన్నడూ పోట్లాటలు లేవు. వైష్ణవ్య స్వయంగా నాతో చెప్పింది. ఆమెకు భర్త మీద అపారమయిన గౌరవం ఉంది. నేను గమనించాను-"

"ఎందుకు పోట్లాటలు లేవు-? వైష్ణవ్య వాదనలు బలమైనవి. ఆమె తనకన్న భిన్నంగా- ధనానికి మించి ఆలోచించటం- రాఘవకి తనకన్న ఆమె చాలా ఉన్నతురాలన్న భావం కలిగించింది-"

"కాదా?"

"నేను జడ్జిని కాను. సైకియాట్రిస్టుని-" అంటూ నవ్వింది.

లలిత కూడా నవ్వింది- "చెప్పండి- డాక్టర్-" అంది.

"ఆ భావన- ఆవిడ చెప్పినదల్లా వినేట్టు చేసింది. తన మనసులో అభిప్రాయాలను చెప్పకుండా చేసింది. వైష్ణవ్య పరిస్థితి వేరు- ఆమె అరుదయిన మనిషే గాని- దృఢమైన వ్యక్తి కాదు."

"ఇంపాజిబుల్-" అంది లలిత.

ఝాన్సీ కాస్త ఆలోచించింది-" చాలా మంది చెయ్యలేని పనులు- చెయ్యటానికి- దృఢత్వం ఉండాల్సిందే-! కొన్ని సందర్భాలలో ఆవేశమే ఆ దృఢత్వం యిస్తుంది- అయితే- ఒక వ్యక్తి ఆలోచన, ప్రవర్తన, చర్య ఒకదానికొకటి సపోర్టివ్‌గా ఉండటమే దృఢత్వం-"

"మన వాళ్ళ కాన్సెప్ట్- త్రికరణ శుద్ధి-"

"ప్రాబబ్లీ-" అంది. మళ్ళీ కొనసాగించింది-" తండ్రి చెప్పినట్లు విని విప్లవాన్ని వదిలి, ముక్కూ మొహం తెలీని మనిషిని పెళ్ళాడి, అమెరికా వెళ్ళిపోయింది- వైష్ణవ్య. దాని అర్థం ఏమిటి?"

"విప్లవం మీద విశ్వాసం సడిలి వుండొచ్చు గదా-"

ఝాన్సీ మాట్లాడలేదు.

"ఉద్యమాల్లో-" అంటూ చెప్పబోయింది లలిత.

ఆగమని చేత్తో వారించి- "మీరు జనరలైజేషన్‌కి దిగుతున్నారు- నా ముందున్నది వైష్ణవ్య కేసు మాత్రమే-"

సరే కానీయండన్నట్లు చూసింది లలిత.

"వివాహం జరిగింది. చెప్పిన ప్రతిదాన్నీ వింటున్నాడు భర్త. పిల్లలు వద్దంది. దాన్ని కూడా ఒప్పేసుకున్నాడు. బహుశా కనీస అభ్యంతరం కూడా చెప్పి వుండడు. అంత ముఖ్యమయిన విషయంలో రాఘవ ధోరణి ఆమెని తబ్బిబ్బు చేసింది. అతను చాలా ఉత్తముడన్న ఇంప్రెషన్ కలిగింది. తన ఆలోచనలు సరయినవే కాని- వాటికి నిలబడే శక్తి తనకు లేదని లోలోపల తనని అసహ్యించుకుంటున్న వైష్ణవ్య- రాఘవని గుడ్డిగా బలంగా విశ్వసించింది-"

"వైష్ణవ్య తెలివయినది. రాఘవ ఎలాంటి వాడో గ్రహించలేదా?"

"గ్రహించగలిగేదే- కాని పరిస్థితి ఏంటంటే- వాళ్ళిద్దరూ అందరికీ దూరంగా అమెరికాలో వున్నారు. తన వైద్యం సంపాదన తప్ప రాఘవకి అప్పట్లో వేరే లక్ష్యాలూ, ఆలోచనలూ లేవు. కనక ఎలాంటి ఘర్షణా వాళ్ళ మధ్య రాలేదు. రాఘవ దేన్నీ ఆలోచించే వాడు కాదు- ఆలోచించినా చెప్పేవాడు కాదు-"

"మీ మాటలికి ఆధారం?"

"ఆపరేషన్. ఆమె రికార్డులు చూసాను. అమెరికా వెళ్ళిన వెంటనే చేయించుకుంది. అంటే- ఎప్పుడయినా పిల్లల పట్ల కోరిక పుడుతుందేమోనని ఆవిడ తనని తను శంకించుకొంది-"

"మీ ఊహ కన్విన్సింగ్‌గా లేదు-"

"ప్రస్తుతానికి- ఈ పాయింటాఫ్ వ్యూతోనే ఈ కేసుని పరిశీలిస్తున్నాను-"

"ఆమె షాక్‌కి- మీరనే దానికీ- లింకు?"

"సింపుల్- బలమైన విశ్వాసానికి బలంగా దెబ్బ తగిలినప్పుడే షాక్‌కి అవకాశం ఉంది-"

"భిక్షం మీద విశ్వాసం బలమయినదయుండొచ్చు గదా- ఆ విశ్వాసంతోనే ఆవిడ పని వాళ్ళకి ఎవరూ యివ్వలేని సౌకర్యాలు యిచ్చింది-"

"భిక్షమే కాదు- ఏ పని వాడికయినా ఆవిడ వాటిని యిస్తుంది. అది ఆవిడ ఆదర్శమే గాని- అతని మీద ప్రత్యేకమైన విశ్వాసం వల్ల జరిగింది కాదు-"

"నాకు భిక్షం బాగా తెలుసు- అతన్ని ఎవరైనా నమ్ముతారు-"

"కావచ్చు. కానీ, పదిహేనేళ్ళుగా తనతో కలిసి జీవించిన వ్యక్తి మీద ఉండే విశ్వాసంతో- పోల్చలేం గదా-"

"రాఘవ గారితో మాట్లాడారా?"

నిట్టూర్చింది ఝాన్సీ- "ఇంత వరకూ ఆయన నాకు సహకరించలేదు"

"ఆయన ఫేమస్ కార్డియాలజిస్టు. బిజీ డాక్టర్" అంది లలిత ఆలోచిస్తూ.

ఝాన్సీ- అదోలా- నవ్వింది.

...5...

"అదేంటి- కథ అయిపోయిందా-!?" అన్నాడు శిష్యుడు.

"అయిపోయింది-" అన్నాడు గురువు.

"భిక్షం ఏమయాడు-? వైష్ణవ్య ఏమయింది? రాఘవ?"

"నీ యిష్టం వచ్చినట్టు ఊహించుకో-"

"కథ చెప్పిన వాళ్ళు మీరు-మీరే చెప్పొచ్చు గదా-"

"నాకు మాత్రం ఏం తెలుసు-"

"పోనీ ఊహించి చెప్పండి-"

"తలిదండ్రులు చెప్పినట్టు విని, వేరే పెళ్ళి చేసుకుని, వారసుల్ని కన్నాడు రాఘవ-"

"వైష్ణవ్య-"

"కేసు నించి భిక్షాన్ని విడిపించి, దత్తత చేసుకుని బిడ్డగా స్వీకరించింది- ప్రజా ఆస్పత్రి ఆరంభించింది-"

"మీ ఊహ బాగులేదు-"

"చెప్పాను గదా- నువ్వే ఊహించుకో-"

"నేరం ఎవరు చేస్తేనేం- శిక్ష వైష్ణవ్యకి పడింది. సంసారం నాశనమయింది."

"తప్పు- ఆమె రాఘవతో బతకటమనే శిక్ష నుంచి తప్పించుకుంది."

"ఏంటో- అసలు ఇండియా రావటమే తప్పయింది"

"ఆశయాలు ఎప్పుడూ తప్పు కావు-"

"ఎందుకు కావు? ఎక్కడుండాల్సిన వాడిని అక్కడ ఉంచకుండా సమానంగా చూడబోయింది- అనుభవించింది"

శిష్యుడి చెంప ఛెళ్ళుమంది.